సాక్షి
అనంతపురం

బుధవారం । 14 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.42వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.42 వేలు పలికాయి.



'పరివర్తన' కలిగేలా..

మద్యం, నాటు సారా తయారీ, విక్రయాలు వీడి గౌరవప్రద జీవనం సాగించాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. 8లో

గరిష్టం/కనిష్టం
40.4°/23.7°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీ 'స్పాట్' ప్రారంభం



స్పాట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్) మంగళవారం అనంతపురం కేఎస్ఆర్ బాలకల పాఠశాలలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే స్పాట్ బుధవారంతో ముగుస్తుంది. జిల్లాకు మొత్తం 18,873 జవాబుపత్రాలు వచ్చాయి. ఇందులో తెలుగు 2,873, హిందీ 1,014, ఇంగ్లిష్ 343, గణితం 4,417, సైన్స్ 7,076, సోషల్ 2,561 జవాబుపత్రాలు ఉన్నాయి. 350 మంది ఏఈ, సీఈలు, 80 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. డీఈఓ ఎం.సాయిరామ్ క్యాంపును ప్రారంభించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్, అనంతపురం డివిజన్ డిప్యూటీ డీఈఓ పద్మప్రియ పర్యవేక్షించారు. కొందరు టీచర్లు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారనే విషయాన్ని డిప్యూటీ డీఈఓ పద్మప్రియ డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆగ్రహించారు. రెండు రోజులు విధుల్లో పాల్గొనలేని వారు రోజూ బడికి ఎలా పోతారని మండిపడ్డారు. ఏ ఒక్కరికీ మినహాయింపు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. నియమించిన వారందరూ కచ్చితంగా విధుల్లో ఉండాల్సిందేనన్నారు. ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

15 మంది డీటీలకు ఉద్యోగోన్నతి

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు భూ పరిపాలన ముఖ్య కమిషనర్ సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్-4 (రాయలసీమ 8 జిల్లాలు) పరిధిలో 45 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.సైఫుల్లాహక్, డి.ఓబులేసు, ఎ.శేషారెడ్డికి, శ్రీసత్యసాయి జిల్లాలో 12 మంది డిప్యూటీ తహసీల్దార్లు ఎ.శ్రీనివాసులు, టి.ఆర్.జమానుల్లాఖాన్, ఎస్.బి.భాస్కర్, బి.నరేంద్రకుమార్, వై.రామనాథ్‌రెడ్డి, కె.రమాదేవి, ఎస్.హమీద్‌బాషా, సయ్యద్ షాబుద్దీన్, రవికుమార్, డి.రమేష్‌బాబు, జి.పి.శోభసువర్ణమ్మ, ఎస్.మురషావలికి ఉద్యోగోన్నతి లభించింది. వీరు ఆయా జిల్లాల కలెక్టర్ల వద్ద రిపోర్టు చేసుకోవాలి. అటు తరువాత కలెక్టర్ వారికి మండలాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఇస్తారు.

బీసీ గురుకులాల్లో మిగులు సీట్లకు 20న రాతపరీక్ష



రాప్తాడురూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 20న రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కన్వీనర్ సంగీతకుమారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిజర్వేషన్లు అనుసరించి ఖాళీలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. నార్పల బీసీ గురుకుల పాఠశాలలో 20 సీట్లకు 84 దరఖాస్తులు, గోనబావిలో 9 సీట్లకు 45, డి.హీరేహాళ్‌లో 3 సీట్లకు 10, కుందుర్పిలో 42 సీట్లకు 86, కొనకొండ్లలో 3 సీట్లకు 29 దరఖాస్తులు వచ్చాయి. 20న ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని కన్వీనర్ తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న తరగతి కాకుండా పూర్వపు తరగతి పాఠ్యాంశాల ఆధారంగా పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 6, 7 తరగతులకు రాత పరీక్ష తెలుగులో 10 మార్కులు, ఇంగ్లిష్ 10, గణితం 15, ఎన్విరాన్మెంటల్ స్టడీస్‌లో 15 మార్కులకు ఉంటుందని వివరించారు. 8, 9 తరగతులకు తెలుగులో 5 మార్కులకు, ఇంగ్లిష్ 10, గణితం 15, సైన్సు 10, సోషల్, జనరల్ నాలెడ్జ్ కలిపి 10 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ప్రకృతికి ప్రణామం

- అంచలంచెలుగా పెరుగుతున్న ప్రకృతి సాగు విస్తీర్ణం
- రసాయనిక ఎరువులు, మందులకు స్వస్తి
- సేంద్రియ ఎరువులతో మేలైన దిగుబడులు
- తగ్గిన పెట్టుబడులు.. పెరిగిన రాబడులు



• గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో మహిళా రైతు వి.తిప్పమ్మ ఎకరం పొలంలో ప్రకృతి సేద్యం కింద పత్తి, దాని సరిహద్దులో సజ్జ, అంతర పంటగా బెండ, చౌళేకాయ, అలసంద, అనప, బంతి పూలు సాగు చేశారు. జీవామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం లాంటి ఆర్గానిక్ మందులు అందించి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. చౌళేకాయలు వారానికి రెండు సార్లు 30 కిలోల చొప్పున కోత కోస్తున్నారు. బెండకాయలు మరో వారంలో కోతకొస్తాయి.



• గుమ్మఘట్ట మండలం బేలోడుకు చెందిన రైతు లింగారెడ్డి తనకున్న 20 సెంట్ల విస్తీర్ణంలోనే ప్రకృతి సేద్యం ద్వారా ధనియాలు, మెంతులు, పాలకూర, ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, చౌళేకాయ, అలసంద, అనప, సజ్జ, మొక్కజొన్న, బంతి, ఆముదం విత్తనాలు ఈ ఏడాది మార్చిలో వేశారు. 16 రోజుల తర్వాత ఆకుకూర పంటలు కోతకొచ్చాయి. వీటి ద్వారా రూ.10 వేలకు పైగా ఆదాయం వచ్చింది. ప్రకృతి సేద్యంతో నేల స్వభావంలోనూ మార్పు కనిపిస్తోంది.



75 వీరాపురం వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పత్తి పంట

రాయదుర్గం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఆవు మూత్రం, పేడతో ఘన, ద్రవ జీవామృతం తయారుచేసుకుని రసాయన ఎరువులు, పురుగుమందులను వాడకుండా చేసే ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభిస్తోంది. మట్టిలో సత్తువ నిలకడగా ఉంటూ సాగుకు మేలుచేసే సూక్ష్మజీవులు అంతరించిపోకుండా క్రమంగా మెరుగుపడుతున్నాయి. ఆర్గానిక్ పంట ఉత్పత్తులకు మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉండడం, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధిస్తుండడం లాంటి కారణాలతో రైతులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. అధికారులిచ్చే సలహా, సూచనలు కూడా తోడు కావడంతో జిల్లాలో ప్రకృతి సేద్యం సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.

ప్రకృతి సేద్యం బాట పట్టారిలా..

జిల్లాలో 2018-19 సంవత్సరంలో 69 క్లస్టర్లలో 28,883 మంది రైతులతో 13,814 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేపట్టారు. 2019-20లో 31,573 మంది రైతులతో 42,076 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. 2020-21లో 38,465 మంది రైతులతో 46,789 ఎకరాల్లో సాగు చేపట్టారు. 2021-22లో క్లస్టర్ల సంఖ్య 81కి పెరిగింది. అదే స్థాయిలో 50,182 మంది రైతులు 71,515 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 2022-23లో 81 క్లస్టర్ల లో 51,250 మంది రైతులతో 79,428 ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టారు. 2023-24లో లక్ష ఎకరాల విస్తీర్ణంలో పంటల సాగు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు అధికారులు వివరించారు.

ప్రకృతి సేద్యంపై అధ్యయనం

జిల్లాలోని ప్రకృతి సేద్యంపై అధ్యయనం చేసేందుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధుల బృందం పలుమార్లు పర్యటించింది. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.విజయకుమార్, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌తో పాటు ఫ్రాన్స్, అమెరికా ప్రతినిధుల బృందం ఇటీవల కళ్యాణదుర్గం మండలం పాలవాయి, భట్టువానిపల్లి గ్రామాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులను కలిసింది. వేరుశనగ పంటతో పాటు నాలుగు ప్రధాన పంటలు, 20 రకాల జీవ వైవిధ్య పంటలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి, ఘన జీవామృతంతోపాటు కలిపి సాగు చేసిన రైతుల అనుభవాలను తెలుసుకుంది.

ప్రకృతి సేద్యం మంచిదే



ప్రకృతి వ్యవసాయం కింద ఎకరం విస్తీర్ణంలో పత్తి పంట పెట్టాను. అవసరమైన మందులన్నీ ఆర్గానిక్ పద్ధతిలో సొంతంగా తయారు చేస్తున్నా. పూత, కాయ ఆశించిన స్థాయిలో కనిపిస్తోంది. రసాయనిక ఎరువులతో సాగు చేసిన పొరుగు రైతులతో పోల్చితే నా పంట పర్వాలేదు. సజ్జ, బంతి కూడా అందులో సాగు చేశాను. నేల స్వభావంలోనూ మార్పు కనిపిస్తోంది. ప్రకృతి సేద్యం బాగుంది. భవిష్యత్తులో కూడా ఈ విధానాన్నే కొనసాగిస్తా.

– ఎస్ రాజన్న, రైతు, 75 వీరాపురం


ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం



జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని క్రమంగా విస్తరిస్తున్నాం. ఏటేటా సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు చేపట్టాం. ఈ కారణంగా మితిమీరి వాడకంలోనున్న రసాయనిక ఎరువులు, పురుగు మందుల ప్రభావం తగ్గిస్తున్నాం. ప్రస్తుతం సాగులో ఉన్న రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ఏటా మరికొందరు రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు ముందుకొస్తున్నారు. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకెళ్తున్నాం. ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వల్ల నేల సాంద్రత కాపాడటంతో పాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధ్యమవుతాయి.

– బి.లక్ష్మానాయక్, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి, అనంతపురం

నేడు ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రాక



అనంతపురం క్రైం: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం జిల్లాకు వస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లే అవుట్ పక్కన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అమ్మ' డెయిరీ ప్రారంభోత్సవానికి హాజరవుతారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ పరిష్కారానికి చర్యలు



అనంతపురంలో ట్రాఫిక్‌పై సీఐ వెంకటేష్‌నాయక్‌కు సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో పర్యటించారు. రహదారులపై అడ్డగోలుగా వాహనాలను ఆపకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపైకి తోపుడు బండ్లు తెచ్చి పెట్టకుండా ఎప్పటికప్పుడు కట్టడి చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఏ చిన్న విషయాన్నీ వదలొద్దన్నారు. ప్రధానంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. రాంగ్‌రూట్లో వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి

గుత్తి: బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలని డీఐజీ అమ్మిరెడ్డి పోలీసులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన గుత్తి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐలు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ఏఎస్‌ఐలు నాగమాణిక్యం, రామచంద్రారెడ్డి, ఆజాద్, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్ నాయక్, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- పౌర సరఫరాల సంస్థ కమిషనర్ అరుణ్‌కుమార్

తాడిపత్రి: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపి, మెరుగైన సేవలందించాలని పౌర సరఫరాల సంస్థ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం అమలుతీరును పరిశీలించేందుకు ఆయన జిల్లాకు విచ్చేశారు. మంగళవారం ఆయన కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, ఆర్డీఓ మధుసూదన్‌తో కలిసి తాడిపత్రి మండలంలో పర్యటించారు. బొందలదిన్నెలో ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తున్న ఇంటింటికీ రేషన్‌ను కమిషనర్ పరిశీలించారు. ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందిస్తున్నారని కార్డుదారులు తెలపడంతో కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హుసేనాపురంలో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిని కమిషనర్ అరుణ్‌కుమార్ సందర్శించి, వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అటు నుంచి సుంకులమ్మపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను పరిశీలించి, చిన్నారులతో మాట్లాడారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణపై గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సజ్జలదిన్నె జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. తాడిపత్రిలోని ట్రిబుల్ ఎస్ ప్రభుత్వ పాఠశాలలోని జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారి కేశవనాయుడు, డీఈ షాషావలి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, సీఎస్‌డీటీ రాజారాం, ఎంఈఓ నాగరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ షాజిదా బేగం, ఈఓఆర్డీ జిలాన్ బాషా, హౌసింగ్ ఏఈ సంధ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, కల్పన పాల్గొన్నారు.



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ్‌కుమార్

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

శింగనమల: చిరుధాన్యాల పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహమందిస్తోందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మండలంలోని సి.బండమీదపల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సర్పంచ్ సరోజమ్మ అధ్యక్షతన చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జొన్న, రాగి, కొర్ర వంటి చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. గత ఏడాది జిల్లాలో ఖరీఫ్ కింద 5,300 ఎకరాల్లో జొన్న, 100 ఎకరాల్లో రాగి, 5,700 ఎకరాల్లో కొర్ర సాగు చేశారన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 10,100 ఎకరాల్లో జొన్న, 1,000 ఎకరాల్లో రాగి, 6,500 ఎకరాల్లో కొర్ర సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. డీఏఓ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రెడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రంలో నాణ్యమైన నంద్యాల తెల్లజొన్న రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, వ్యవసాయ శాస్త్రవేత్త శశికళ, ఏఓ అన్వేష్‌కుమార్, ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- ఉమ్మడి జిల్లాకు ఫస్టియర్‌లో 6, సెకిండియర్‌లో 7వ స్థానం

రాప్తాడు రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలో 6వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 7వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 24,331 మంది పరీక్షలు రాయగా 18,710 మంది (76.90 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 24,476 మంది పరీక్షలు రాయగా 20,008 మంది (81.75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మార్చిలో జరిగిన రెగ్యులర్ పరీక్షలకంటే సప్లిమెంటరీ ఫలితాలు మెరుగయ్యాయి.

- మొదటి సంవత్సరం ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,923 మంది విద్యార్థులకు గాను 763 మంది పాసయ్యారు. అలాగే కేజీబీవీల్లో 579 మందికి గాను 288 మంది, మోడల్ స్కూళ్లలో 712 మందికి గాను 291 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 269 మందికి గాను 162 మంది, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల్లో 53 మందికి గాను 26 మంది, ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 26 మందికి గాను 10 మంది, ఎయిడెడ్ కళాశాలల్లో 414 మందికి గాను 109 మంది, బీసీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 66 మందికి గాను 43 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 6,063 మందికి గాను 2,498 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,784 మంది విద్యార్థులకుగాను 1,351 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే కేజీబీవీల్లో 230 మందికి గాను 166 మంది, మోడల్ స్కూళ్లలో 765 మందికి గాను 360 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 274 మందికి గాను 150 మంది, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల్లో 49 మందికి గాను 29 మంది, ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 24 మందికి గాను ఆరుగురు, ఎయిడెడ్ కళాశాలల్లో 493 మందికి గాను 249 మంది, బీసీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 42 మందికి గాను 27 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 6,064 మందికి గాను 2,688 మంది పాసయ్యారు.

క్లుప్తంగా

రిమాండ్‌కు 28 మంది మట్కా బీటర్లు


బీటర్లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

యాడికి: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో మట్కా రాస్తున్న 28 మంది బీటర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య తెలిపారు. మంగళవారం యాడికి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శంకరరెడ్డితో కలసి ఆయన వెల్లడించారు. మట్కా, పేకాట తదితర జూదాల నియంత్రణకు ఎస్‌ఐలు గురుప్రసాదరెడ్డి, ఖాజాహుస్సేన్, శ్రీనివాసులు నేతృత్వంలో సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మట్కా రాస్తూ 28 మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.5.15 లక్షల నగదు, 70 మట్కా పట్టీలు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

స్కూల్ బస్సుల సీజ్

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న ఐదు స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. మంగళవారం తాడిపత్రి, గుంతకల్లు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేసినట్లు వివరించారు.

‘పరివర్తన’ కలిగేలా...



ఈమె పేరు సోనియా. బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామం. ఒకప్పుడు సారా వ్యాపారంతో సాగిస్తున్న జీవనంపై విరక్తి చెంది గొర్రెల పెంపకంపై ఆసక్తి పెంచుకున్నారు. విషయం తెలుసుకున్న డీఆర్‌డీఏ అధికారులు రూ.50 రుణాన్ని అందజేశారు. ఈ మొత్తంతో పది గొర్రెలను కొనుగోలు చేసి, పోషించి విక్రయించగా రూ.25 వేలు లాభం వచ్చింది. ఆ మొత్తాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టి గొర్రెలను వృద్ధి చేసుకుని ప్రశాంత జీవనం సాగిస్తున్నారు.



ఈమె పేరు ఝాన్సీ. బెళుగుప్ప గ్రామం. ఒకప్పుడు బతుకు తెరువు లేక సారా వ్యాపారం సాగించేవారు. సమాజంలో గౌరవ మర్యాదలు సన్నగిల్లడంతో ఆ వ్యాపారానికి స్వస్తి పలికి గొర్రెల పెంపకాన్ని చేపట్టారు. డీఆర్‌డీఏ అధికారులు అందజేసిన రూ.1.05 లక్షల రుణంతో గొర్రెలను కొనుగోలు చేసి, పోషించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులేవీ లేవు. సమాజంలో గౌరవ ప్రతిష్టలూ పెరిగాయి. పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. సబ్సిడీ మొత్తం పోనూ మిగులు రూ.35 వేలుతో మరిన్ని గొర్రెలు కొనుగోలు చేయాలని అనుకుంటున్నారు.

- అక్రమ మద్యం, నాటు సారా తయారీదారులపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పన
- చేయూత, ఆసరా పథకాల ద్వారా అండ

అనంతపురం: అక్రమ మద్యం, నాటు సారా తయారీ, విక్రయాలను స్వచ్ఛందంగా వదులుకుని సమాజంలో గౌరవ ప్రదమైన జీవనం సాగించాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఇందుకోసం ప్రత్యేకంగా పరివర్తన కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తోంది. వైఎస్సార్ చేయూత, ఆసరా లాంటి పథకాల ద్వారా వారికి ఊతమివ్వాలని, ఆదాయం సమకూరే దిశగా ఉపాధి మార్గాలను అధికారులు చూపుతున్నారు. జగన్ సర్కార్ అమలు చేస్తున్న పరివర్తన కార్యక్రమం పూర్తి స్థాయిలో ఫలించింది. జిల్లాలోని ఆత్మకూరు, బెళుగుప్ప, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, పామిడి, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, వజ్రకరూరు, యాడికి మండలాల్లో ఈ ఏడాది నాటు సారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలను వదులుకుని ముందుకు వచ్చిన 121 మందికి అక్షరాల కోటి లక్షా అరవై నాలుగు వేల (రూ.1,01,64,000) రూపాయల లబ్ధి చేకూర్చింది. ప్రభుత్వ ప్రోత్సాహం అందుకున్న వారు ప్రస్తుతం జీవనోపాధులను మెరుగు పరుచుకుని సమాజంలో గౌరవ ప్రదమైన జీవనం సాగిస్తున్నారు.

ఈ ఏడాది మండలాల వారీగా చేకూరిన లబ్ధి

మండలం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం
ఆత్మకూరు	03	రూ.1,60,000
బెళుగుప్ప	26	రూ.22,70,000
గుత్తి	13	రూ.11,57,000
గుంతకల్లు	10	రూ.6,74,000
కళ్యాణదుర్గం	10	రూ.10,50,000
కంబదూరు	02	రూ.1,00,000
పామిడి	29	రూ.2,59,2000
రాయదుర్గం	01	రూ.60,000
శింగనమల	02	రూ.1,50,000
తాడిపత్రి	11	రూ.9,30,000
వజ్రకరూరు	07	రూ.5,81,000
యాడికి	07	రూ.4,40,000
మొత్తం	121	రూ.1,01,64,000

ప్రశాంత జీవనం



నా భర్త సునీల్‌నాయక్ గతంలో ఉరవకొండలో నాటుసారా అమ్మేవాడు. ప్రత్యామ్నాయ ఉపాధిపై డీఆర్‌డీఏ అధికారులు అవగాహన కల్పించడంతో పొట్టేళ్ల పెంపకంపై దృష్టి సారించాం. గతేడాది నవంబర్‌లో రూ.60 వేల రుణం మంజూరు చేశారు. ఇందులో రూ.30 వేలు సబ్సిడీ వర్తింపజేశారు. ఈ మొత్తంతో 8 పొట్టేళ్ల పిల్లలను కొనుగోలు చేసి, పెంచి పోషించాం. పెద్దగైన తర్వాత అమ్మితే రూ.92 వేలు వచ్చింది. సబ్సిడీ రూ.30 వేలు, రూ.32 వేలు లాభం మొత్తం రూ.62 వేలతో తిరిగి పొట్టేలు పిల్లలు కొనుగోలు చేసి, జీవనోపాధిని మెరుగు పరుచుకుని ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాం.

– రత్నాబాయి, రాకెట్ల తండా, ఉరవకొండ మండలం

గౌరవం దక్కింది



నా భర్త హనుమంతు నాయక్ గతంలో రాకెట్లలో నాటుసారా అమ్మేవాడు. అప్పట్లో నానా ఇబ్బందులు పడ్డాం. మాలో పరివర్తన వచ్చేలా అధికారులు గత ఏడాది నవంబర్‌లో రూ.60 వేల రుణం మంజూరు చేశారు. ఇందులో రూ.30 వేల సబ్సిడీ వర్తింపజేశారు. ఈ మొత్తంతో 8 పొట్టేళ్లను పెంచి పోషించి మార్చిలో అమ్మగా రూ.లక్ష వచ్చింది. ఈ డబ్బుతో పొట్టేళ్ల పెంపకాన్ని అభివృద్ధి చేసుకున్నాం. ప్రస్తుతం సమాజంలో మమ్మల్ని గౌరవ ప్రదంగా చూస్తున్నారు.

– ఎం. సాలమ్మ, రాకెట్ల తండా, ఉరవకొండ మండలం

121 కుటుంబాలకు లబ్ధి



ఏదైనా రంగంలో స్థిరపడి జీవనోపాధిని మెరుగుపరుచుకుని, ఆత్మగౌరవంతో జీవించడమే పరివర్తన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ పరివర్తన కార్యక్రమం ద్వారా 121 కుటుంబాలకు ఉపాధి కల్పించాం. మొత్తం రూ.1,01,64,000 రుణ సదుపాయం కల్పించాం. ఇందులో అత్యధికంగా సబ్సిడీ రుణాలే ఉన్నాయి.

– ఐ. నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

బీటీపీ పనులకు సీఎం సానుకూలం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: నియోజకవర్గానికి జీవనాడిగా ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టు పనుల పూర్తికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం వైఎస్ జగన్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీటీపీ కాలువ పనులను వివరించారు. బీటీపీని నీటితో నింపితే కళ్యాణదుర్గం నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇందుకు స్పందించిన సీఎం వైఎస్ జగన్ త్వరలో కాలువ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంత్రి ఉషశ్రీచరణ్ ‘సాక్షి’కి తెలిపారు.

సీఎంను కలసిన రమేష్‌గౌడ్


సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న రమేష్‌గౌడ్

అనంతపురం క్రైం: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు జ్ఞాపికను అందజేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి చేయూతనిచ్చినందుకు రాష్ట్రంలోని బీసీలందరూ రుణపడి ఉంటారని తెలిపారు.

రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో యూజీ (బీఎస్సీ) ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 37 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. అలాగే అనంతపురం, హిందూపురం, ఉరవకొండ, తాడిపత్రి కేంద్రాల్లో మధ్యాహ్నం నుంచి దూరవిద్య నాలుగో సెమిస్టర్ పీజీ, యూజీ పరీక్షలను నిర్వహించనున్నారు.

ఏపీ ద్రోహి బీజేపీ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజం



అనంతపురం క్రైం: తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని, విభజన హామీలు నెరవేరుస్తామని 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అధికారం చేపట్టిన తర్వాత బుట్టదాఖలు చేసిన నీచ చరిత్ర నరేంద్ర మోదీదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జగన్ సర్కార్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ఆరోపణలను ఖండించారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సమక్షంలోనే మోదీ హామీలు గుప్పించారని గుర్తు చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం పూర్తికి నిధులు, విశాఖకు రైల్వే జోన్, విశాఖ-చెన్నై మార్గంలో పారిశ్రామిక కారిడార్ తదితర హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఏ ఒక్కటి నెరవేర్చకుండా ఏపీ ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ నేడు దేశంలో ఎక్కడ లేని విధంగా పారదర్శక పాలన సాగిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను దరి చేరుస్తున్నారన్నారు. దాదాపు రూ.2.10 లక్షల కోట్ల మేర లబ్ధిని రాష్ట్ర ప్రజలు అందుకున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఈ విషయాన్ని పక్కనపెట్టి రాజకీయ లబ్ధి కోసం జగన్ సర్కార్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోబోరన్నారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

సజావుగా మెడికల్ ఆఫీసర్ల కౌన్సెలింగ్

అనంతపురం క్రైం: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మెడికల్ ఆఫీసర్ల నియామక కౌన్సెలింగ్ సజావుగా సాగింది. అభ్యర్థుల సర్టిఫికెట్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, ఫ్యామిలీ డాక్టర్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు నిశితంగా పరిశీలించారు. 14 స్థానాలకు గాను 10 మంది హాజరు కాగా, ఇందులో 8 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరికి రాయదుర్గంలో ఇద్దరు, కళ్యాణదుర్గం యూపీహెచ్‌సీ, శింగనమల, పామిడి, కళ్యాణదుర్గం, గుత్తి, హిందూపురం సీహెచ్‌సీలకు పోస్టింగ్ ఇచ్చారు.

పీహెచ్‌డీ దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తోంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.నరసింహులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్.. గేట్ అర్హత సాధించిన వారు అర్హులు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాచమల్లు కొనసాగింపు



అనంతపురం: జిల్లా ప్రధాన కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా రాచమల్లు హరినాథరెడ్డిని కొనసాగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 ఫిబ్రవరి నుంచి ఈ హోదాలో ఉన్న ఆయనను తాజాగా 2026 జూన్ వరకూ కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంతకల్లు మండలం అమాన్‌పల్లికి చెందిన రాచమల్లు హరినాథరెడ్డి రెండో దఫా జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకం కావడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.


మడ్డిపల్లి వీహెచ్‌ఏపై దాడి

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో వీహెచ్‌ఏగా పనిచేస్తున్న రవితేజాపై నారాయణరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాసుల రెడ్డి దాడి చేశాడు. మంగళవారం సచివాలయానికి చేరుకున్న శ్రీనివాసులరెడ్డి తనకు పంట నష్ట పరిహారం మంజూరు కాలేదంటూ అక్కడే ఉన్న రవితేజాను నిలదీశాడు. దీంతో జాబితాను పరిశీలించిన వీహెచ్‌ఏ.. అందులో పేరు ఉందని, అయితే బ్యాంక్ ఖాతా నంబర్ తప్పుగా ఉండడంతో డబ్బు జమ కాలేదని వివరించాడు. దీంతో సహనం కోల్పోయిన శ్రీనివాసరెడ్డి వీహెచ్‌ఏపై దాడి చేశాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

‘విద్యార్థులందరూ ట్యాబులు తీసుకెళ్లాలి’

రాప్తాడురూరల్: గత విద్యా సంవత్సరం బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్ తీసుకున్న ప్రతి విద్యార్థీ బుధవారం వాటిని పాఠశాలలకు తీసుకెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ట్యాబ్‌లను తీసుకెళ్లి వాటి పనితీరును ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో పరిశీలన చేయించాలన్నారు. వాటి వర్కింగ్ కండీషన్, సెలవు దినాల్లో విద్యార్థులు ఏఏ అంశాలను పరిశీలించారో వివరాలు నమోదు చేసి వెంటనే మండల విద్యాశాఖాధికారి ద్వారా డీఈఓ కార్యాలయానికి నివేదికను అందజేయాలన్నారు. ఏదైనా ట్యాబ్ పని చేయకుంటే వెంటనే టెక్నికల్ పర్సన్‌ల హెల్ప్‌లైన్ నంబర్ల (89770 10222, 89775 06444, 89776 09444)కు కాల్‌చేసి వారి సూచనల ఆధారంగా సరిచేయించి విద్యార్థులకు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా నోడల్ అధికారి (94917 77766)ని సంప్రదించాలన్నారు.

కుప్పకూలి వృద్ధుడి మృతి


మృతుడు జయప్ప

గుత్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఓ వృద్ధుడు కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుత్తి మండలం ఇసురాళ్లపల్లికి చెందిన జయప్ప (82) తన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు కుటుంబసభ్యులతో కలసి మంగళవారం ఉదయం గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాడు. అయితే కార్యాలయం వద్దకు చేరుకోగానే ఉన్నఫళంగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళితే.. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐటీఐలో ప్రవేశాలకు నేడు కౌన్సెలింగ్

లేపాక్షి: పారిశ్రామిక శిక్షణకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ పి.రాయపురెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేవారు. జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఈ ఏడాది చేపట్టిన ప్రవేశాలకు సంబంధించి తొలి విడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు కౌన్సిలింగ్ హాజరు కావాలి. విద్యార్థులు సాధించిన మార్కులు, జీపీఏ ఆధారంగా కౌన్సిలింగ్ ట్రేడ్‌లను కేటాయించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెరిట్ జాబితాలో 1 నుంచి 27వ స్థానంలో ఉన్న వారికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెరిట్ జాబితాలో 28 నుంచి 54 స్థానంలో ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి.

నిందితుడు ‘నితిన్‌సాయి’ మేనేజరే

- విజిలెన్స్ ఏడీ ల్యాప్‌టాప్ చోరీ కేసులో మిస్టరీని ఛేదించిన పోలీసులు
- సీసీ ఫుటేజీల ఆధారంగా బట్టబయలైన బండారం
- నిందితుడు శంకర్‌రెడ్డి అరెస్ట్


విజిలెన్స్ అధికారుల వాహనం నుంచి ల్యాప్‌ట్యాప్‌ను తీసుకెళుతున్న దృశ్యం (సీసీ ఫుటేజీ)

ధర్మవరం: విజిలెన్స్ శాఖ ఏడీ ల్యాప్‌టాప్ చోరీ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. రోడ్డు పనుల నాణ్యతలో డొల్లతనం బట్టబయలవుతుందనే భయంతో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యమే ఇందుకు ప్రోత్సహించిందని, ల్యాప్‌టాప్‌ను చోరీ చేసింది ఆ కంపెనీ మేనేజర్ శంకర్‌రెడ్డేనని నిగ్గు తేల్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న శంకరరెడ్డిని బుధవారం ముదిగుబ్బ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు వెల్లడించారు.

అక్రమాలన్నీ ల్యాప్‌టాప్‌లోనే..

ముదిగుబ్బ నుంచి మలకవేముల క్రాస్ వరకూ రహదారి పనులను నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చేపట్టింది. అయితే ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలివ్వడమే కాక, నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ క్రషర్లను వినియోగిస్తున్నట్లుగా మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో మైనింగ్ అండ్ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ అక్రమాలు బట్టబయలయ్యాయి. ఈ వివరాలన్నీ నివేదిక రూపంలో అధికారులు ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేశారు.

వాహనంలో నుంచి ల్యాప్‌టాప్ అపహరణ

ఈ నెల 6న తనిఖీలు పూర్తి చేసి, ల్యాప్‌టాప్‌లో వివరాలన్నీ నమోదు చేసిన విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి.. అదే రోజు మధ్యాహ్నం ముదిగుబ్బలోని ఓ హోటల్‌లో భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో ల్యాప్‌టాప్‌ను తమ బొలెరో వాహనంలోనే వారు ఉంచారు. అప్పటి వరకూ అధికారులను అనుసరిస్తూ వచ్చిన నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ మేనేజర్ శంకరరెడ్డి.. అధికారుల బొలెరో వాహనం వద్ద ఎవరూ లేని సమయంలో ల్యాప్‌టాప్‌ను అపహరించుకెళ్లాడు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. ఘటనపై అప్పట్లో అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ముదిగుబ్బ పోలీసులు ల్యాప్‌టాప్ చోరీ జరిగిన ప్రదేశంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించి, పరిశీలించారు. అందులో శంకరరెడ్డి కదలికలు స్పష్టంగా ఉండడంతో అతనే దొంగగా నిర్ధారించుకుని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. దీంతో శంకర్‌రెడ్డితో పాటు నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మాతాశిశు మరణాలను పూర్తి స్థాయిలో నివారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి ఆదేశించారు. మాతాశిశు మరణాలపై క్రిష్టిపాడు, చుక్కలూరు, కొకుంట్ల, ఆత్మకూరు, పెద్దవడుగూరు పీహెచ్‌సీలతో పాటు అనంతపురంలోని నీరుగంటి వీధి, వినాయకనగర్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో మంగళవారం తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై ఆరా తీశారు. గర్భం దాల్చినప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గాల్లో దీపం ఉంచి దేవుడే దిక్కు అన్న చందంగా విధులు నిర్వర్తించకూడదని హెచ్చరించారు. గర్భిణులకు టిఫ్ఫా స్కాన్‌తో కలుపుకుని మొత్తం నాలుగు స్కాన్‌లను చేయించాల్సిన బాధ్యత ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాలదేనని పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. వివిధ దశల్లో గర్భిణి, గర్భస్థ శిశువు పరిస్థితిని తెలుసుకుని అందుకు తగినట్లుగా వైద్యం, పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రసవం జరిగే నాలుగు వారాల ముందు గర్భిణుల ఇళ్లను ఎంఎల్‌హెచ్‌పీలు సందర్శించి కాన్పు జరిగే తేదీతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు డాక్టర్ పార్వతి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ కళావతి, ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ణ, డిప్యూటీ డెమో త్యాగరాజు, పీహెచ్ఎన్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన సీఏఎస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలను పర్యవేక్షిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూలు మంగళవారం ముగిశాయి. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అధ్యక్షతన రాష్ట్ర గవర్నర్ నామినీ, వివిధ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కెమికల్ విభాగంలో అసోసియేట్ నుంచి ప్రొఫెసర్, మేథమేటిక్స్ విభాగంలో అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్, ఇంగ్లిష్ విభాగం నుంచి అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్, ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించనున్నారు. ఇంటర్వ్యూ బోర్డులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత సభ్యులుగా ఉన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన యు.శ్రీనివాస్‌కు మంగళవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ పర్యవేక్షణలో ' యాన్ అడాప్టివ్ అండ్ డీసెంట్రలైజ్డ్ స్టేట్ ఫీడ్ బ్యాక్ కంట్రోలర్ ఫర్ ఇంప్రూవింగ్ డ్యాంపింగ్ ఫర్‌ఫార్మెన్స్ ఆఫ్ పవర్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

జాగ్రత్తలు పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు: జాగ్రత్తలు పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని మండల వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం తలుపూరులో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా అసంక్రమిత, రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేశారు. అతిసార పక్షోత్సవాల్లో భాగంగా నీళ్ల విరేచనాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరయ్య, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంస్థ మనుగడ

- ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని



కండక్టర్‌కు అవార్డు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సుమంత్

అనంతపురం సిటీ: ఉద్యోగులు, సిబ్బంది అందరూ సమష్టిగా కృషి చేసి, ఆదాయాన్ని పెంచుకోగలినప్పుడే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని అన్నారు. మంగళవారం అనంతపురం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. మే నెలలో లక్ష్యానికి మించి ఆదాయం తెచ్చిన కండక్టర్లు వెంకటేశులు, ఇన్నయ్య, సత్యమయ్య, పుల్లయ్య, రంగనాథరెడ్డి, డీజిల్ పొదుపు పాటించిన డ్రైవర్లు శ్రీనివాసులు, కుమార్, వీరన్న, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఏడీసీ రాజారావు, ఎలక్ట్రీషియన్ శ్రీధర్‌కు నగదు బహుమతులు అందించారు. డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుల సందడి

విద్యాసంవత్సరం మొదలైంది.. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి..ఎక్కడ చూసినా చదువులు సందడే కనిపిస్తోంది... ఇన్నాళ్లూ వేసవి సెలవుల్లో ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు.. సంబరంగా బడిబాట పట్టారు. తాము చదువుకోలేదు.. తమ పిల్లలకు నడక, నడవడికతోపాటు నాలుగక్షరాలు నేర్పిస్తే బతుకు బాగు పడుతుందని తల్లిదండ్రులు ఆశపడుతున్నారు... వారి భవిష్యత్ కోసం అహర్నిశలూ పరితపిస్తున్నారు. పిల్లలకు విద్యాసామగ్రి కొనుగోలులో బిజీ అయ్యారు. వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసినా విద్యాసామగ్రి దుకాణాలు కిక్కిరిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



బ్యాగులు బాగున్నాయే..
కిక్కిరిసిన బ్యాగుల దుకాణం



ట్రంకు 'పెట్టె' అ'ధర'గొట్టె..
అబ్బా .. పెట్టె ఎంత బరువో..



వీళ్ల బ్యాగులు మోయలేకున్నాం తల్లీ..



హాస్టల్‌లో ఉండేందుకు బ్యాగులు, దుప్పట్లు కొనుగోలు చేసి బైక్‌పై తీసుకెళ్తున్న ఓ తండ్రి



వచ్చే నెలలో వేంకటేశ్వర వైభవం

అనంతపురం కల్చరల్: అనంతలో వచ్చేనెల 28,29 తేదీల్లో శ్రీ వేంకటేశ్వర వైభవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధినేత విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ట్రస్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు నగరంలో కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు.

నగరంలో చైన్ స్నాచింగ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని పాతూరు గాంధీ బజారులో సోమవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. రాత్రి 9.12 గంటలకు ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని వెళ్లేందుకు ఓ దుండగుడు ప్రయత్నించడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో సగం గొలుసు తెగి దుండగుడి చేతికి చిక్కడంతో ఉడాయించాడు. ఘటనపై బాధితురాలు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడున్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్ కుటుంబ రుణం తీర్చుకుంటాం



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న మైనార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

అనంతపురం సిటీ: ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి వైఎస్ కుటుంబం చేసిన సాయం మర్చిపోలేమని, రాబోవు ఎన్నికల్లో ఆ కుటుంబ రుణం తీర్చుకుంటామని ముస్లిం మైనార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ×హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాత్× కార్యక్రమంలో భాగంగా వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో అనంతపురం రెండో రోడ్డులోని బావుద్దీన్ మస్జీద్, గుల్జార్‌పేటలోని మస్జీద్-ఏ-ఆయేషా (మర్కజ్) మస్జీద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ ఖాదర్‌బాషా, అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ హిరియల్ నదీం అహమ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మరో 30 ఏళ్లు జగనే సీఎంగా ఉండాలి..
ముస్లింమైనార్టీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసి ముస్లింల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. ఆయన బాటలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి, ఉన్నత పదవుల్లో నియమించడం గర్వకారణమన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషి ముస్లింలపై ఆయనుకున్న అభిమానానికి నిదర్శనమన్నారు. మరో 30 ఏళ్ల పాటు వైఎస్ జగనే సీఎంగా ఉండాలని వారు కోరుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, కో-ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు గఫార్, ఇమ్రాన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి

- ఆర్‌డీటీపీ సంజీవ్‌కుమారన్



ఆర్‌డీటీపీగా బాధ్యతలు తీసుకున్న సంజీవ్ కుమారన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



అహుడా ఏపీఓగా బాధ్యతలు తీసుకున్న ఇస్సాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న లైసెన్స్ ఇంజినీర్లు

అనంతపురం క్రైం: అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని అనంతపురం నూతన రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (ఆర్‌డీటీపీ) సంజీవ్ కుమారన్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌డీటీపీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. కడప డిప్యూటీ సిటీ ప్లానర్‌గా ఉన్న ఈయన బదిలీపై అనంతపురానికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన వివిధ జిల్లాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. భవన నిర్మాణాల అనుమతులను సకాలంలో ఇచ్చేలా చూడాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రణాళిక కార్యదర్శులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వారి లాగిన్‌లో అనుమతులకు సంబంధించిన ఫైళ్లను ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన నివృత్తి చేయాలన్నారు. సమావేశంలో అహుడా పీఓ శివప్రసాద్, పీఓ ఇస్సాక్, టీపీఓ శిరీష, టీపీబీఎస్ మహబూబ్‌జాన్, మురళీ, దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

దేవీకుమారికి సన్మానం: ఆర్‌డీటీపీగా ఉన్న దేవి కుమారిని నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌గా బదిలీ అయిన విషయం విదితమే. మంగళవారం కార్యాలయ సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఆమెను సన్మానించారు.

అహుడా ఏపీఓగా ఇస్సాక్ అహ్మద్ ..
అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడ) అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఇస్సాక్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల గుంతకల్లు ఏసీపీగా ఉన్న ఈయన అహుడా ఏపీఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అహుడా కార్యాలయంలో ఆయన్ను లైసెన్స్ ఇంజినీర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో లైసెన్స్ ఇంజినీర్లు బోయ తిరుపాల్, కృష్ణ, రవి, మురళీ, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ డెయిరీ ప్రారంభోత్సవానికి తరలిరండి



డెయిరీ ప్రారంభానికి తరలిరావాలని పిలుపునిస్తున్న ఎంపీపీ హేమలత, నాయకులు

ఆత్మకూరు: 'అమ్మ'డెయిరీ ప్రారంభోత్సవానికి తరలి రావాలని ఎంపీపీ హేమలత, నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం డెయిరీ ప్రారంభోత్సవ కరపత్రాలను మండలంలో పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ డెయిరీ ప్రారంభోత్సవానికి వెళ్లేందుకు మహిళలకు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బైకు ర్యాలీ ఉంటుందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి ..
మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ షర్మిలను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఎంపీటీసీ ఓబులేష్, అంజినప్ప, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్, సచివాలయ కన్వీనర్ ఓబీ టైలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇంకుడు గుంత నిర్మాణం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని కుంటలో ఇంకుడు గుంత నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.1.5 లక్షల ఉపాధి నిధులతో 20+20 సైజులో గుంత తవ్వుతున్నారు. మంగళవారం సర్పంచ్ అంజియాదవ్ పనులను పరిశీలించారు. పంచాయతీలో కుంటలో మూడు ఇంకుడు గుంతల తవ్వకాలకు అధికారులను కోరామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి



సహాయ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ అర్చక సమాఖ్య ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా అర్చకుల జీవన స్థితిగతులు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఏపీ అర్చక సమాఖ్య ప్రతినిధులు జిల్లా ఎండోమెంటు సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడిని కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని మొదటిరోడ్డు శివాలయంలో ఏపీ అర్చక సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. అర్చక సమాఖ్య గౌరవాధ్యక్షుడు పులమాచార్యులు, అధ్యక్షుడు పూజారి భీమప్ప మాట్లాడారు. అనువంశిక అర్చకుల పేర్లను 43 రిజిస్టర్‌లో నమోదయ్యేలా చూడాలని, దూప దీపనైవేద్యం కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేలను రూ.10 వేలకు పెంచాలని, ప్రభుత్వ పథకాలు అర్చకులకు వర్తించేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్చకులకు గృహ రుణాలు, డెత్ ఎక్స్‌గ్రేషియా తదితర విషయాలను అర్చక సమాఖ్య ప్రతినిధులు ఏసీతో చర్చించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి శివశంకర శర్మ, సహాయ కార్యదర్శి తిమ్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కోశాధికారి బాలాజీ మారుతి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పూజలు



పూర్ణ కుంభాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కనగానపల్లి: తగరకుంటలో వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళశారం జీర్ణోద్ధరణ పూజలు నిర్వహించారు. వేదపండితులతో ఉదయం నుంచి గణపతి, గోపూజ, పూర్ణాహుతి పూజలు చేయించారు. సాయంత్రం భక్తులు పూర్ణ కుంభాలతో ఊరేగించి, తర్వాత గంగపూజ, రక్షా బంధన, కుంభాలంకార పూజలు చేశారు. పూజల్లో స్థానిక గ్రామస్తులతో పాటు బెంగళూరు నగరం నుంచి వందలాది మంది స్వామి కాపులు తరలి వచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచి హోమాలు, మహా కుంభిషేకాలు నిర్వహించి, జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భళారే వి'చిత్రం'

చూడు చూడు.. పాన్పు 'సీను' చూడు!

మిట్ట మధ్యాహ్నం..మండే ఎండలు..నేల నిప్పులకొలిమిని తలపిస్తోంది..గొడుగు నీడన నడవాలనిపిస్తుంది..చెట్టునీడన నిలవాలనిపిస్తుంది.. ఇదిగో ఇతనికి రహదారి మధ్యలో ఇలా నిద్రించాలనిపించింది...అటు ఇటు వాహనాలు తిరుగుతున్నా..కింద పడిపోతే ప్రమాదమని తెలియదేమో.. ఎవరు ఎటు పోతే నాకేం అనుకున్నాడో ఏమో.. ఇలా నింపాదిగా పడుకోవడాన్ని చూసి 'నిద్ర సుఖమెరుగదు' .. అనుకుంటూ పాదచారులు, వాహనదారులువెళ్లిపోయారు..

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:





పోలీస్ పెట్రోల్ బంకు ఎదురుగా రామ్‌నగర్‌కు వెళ్లే రహదారిపై ఎండలో ఓ వ్యక్తి ఇలా పాన్పుసీను వేశాడు..

చిరుధాన్యాలపై చిన్నచూపొద్దు

- అవగాహన సదస్సులో వ్యవసాయశాఖ ఏడీ రవి



మాట్లాడుతున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: చిరుధాన్యాలపై చిన్నచూపు వద్దని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం స్థానిక కృషి భవన్‌లో చిరుధాన్యాలపై అధికారులు, రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏడీఏ రవి, వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సహజదేవ హాజరై వాటి విశిష్టత, సాగు అవశ్యకతపై తెలియజేశారు. చిరుధాన్యపు పంటల సాగు, వాటి ఉత్పత్తుల వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనే ఆలోచనతో ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 'మిల్లెట్ ఇయర్'గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో చిరుధాన్యపు పంటల సాగుపై అటు అధికారులు ఇటు రైతులు చిన్నచూపు చూడకుండా ప్రోత్సహించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కూడా సజ్జ, రాగి, కొర్ర, జొన్నతో పాటు సంప్రదాయ పంటలైన ఆరిక, అండుకొర్రలు, ఊదల సాగు విస్తీర్ణం పెంపునకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ తరహా పంటల సాగుకు ముందుకు వచ్చే రైతులకు ఇన్‌పుట్స్ రాయితీతో విత్తనం ఇవ్వడంతో పాటు పండించిన తర్వాత మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పంటల విస్తీర్ణం పెరిగితే భవిష్యత్తులో ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సమావేశంలో ఏవోలు పి.వెంకటేశ్వరప్రసాద్, శశికళ, సుచరిత, శ్యాంసుందరరెడ్డి, సోమశేఖర్, ఆత్మ చైర్మన్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడికి చెందిన శివ అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివ కొన్ని రోజులుగా కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి పొలం వద్దకు వెళ్లి విష ద్రావకం తాగాడు. కుటుంబసభ్యులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు.

మద్యం విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: ఇసురాళ్లపల్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వీర్రాజు అనే వ్యక్తిని మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. వీర్రాజు ఇంట్లో 20 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

గార్లదిన్నె: మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు స్పెషల్ సమ్మరీ రివిజన్ ట్రైనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2024 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు.





